# అదే పదివేలు

"సుందరం ! ఓయ్ ! నిన్నే ఏవి టంత హడావుడిగా పరుగెడుతున్నావు?" బస్సు స్టాండువేపు త్వరత్వరగా నడుచుకుంటూ పోతున్న సుందర్రావుని అపుతూ అడిగాడు రామేశం.

"ఎవరూ? నువ్వా రామేశం? నే చూడనే లేదయ్యా ! బాగున్నావా?" ముందుకు పోతున్న వాడల్లా ఆగి అన్నాడు సుందర్రావు.

"ఆ బాగే ! ఇంతకీ ఎక్కడుంటున్నావు? చాలా కాలమైందయ్యా నిన్ను చూసి". ఆనందపడుతూ అన్నాడు రామేశం.

"ఎక్కడో ఏమిటి? ఇక్కడే ఈ ఊళ్ళోనే నీకు తెలుసుగా రిటైర్‌మెంట్ ముందు ఇల్లు కట్టుకోవడం. మరి మా పెద్దోడికి, రెండో వాడికీ ఉద్యోగాలు ఈ ఊళ్ళోనే మరి ఇంకెక్కడి కెడతాను? ఇక్కడే స్థిరపడ్డా". వివరించాడు సుందర్రావు.

"అవునవును గృహప్రవేశానికి కూడా పిలిచావు. అప్పు డెందుకో రాలేకపోయాను. ఇప్పటికీ ఆ ఇన్విటేషన్ నా దగ్గరుంది. వస్తాలే ఏదో రోజున". అన్నాడు రామేశం.

"రా, మా ఇల్లు చూద్దువు గాని మరేవిటి విశేషాలు?" అన్నాడు వాచీ చూసుకుంటూ సుందర్రావు.

"ఏమున్నాయి? మా పెద్దోడు బొంబాయిలో. రెండోవాడు ఇక్కడే స్టేట్ బ్యాంకులో. ఇద్దరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. ఆడపిల్లల బెడద లేదు". అన్నాడు రామేశం సన్నగా నవ్వుతూ.

"అదృష్టవంతుడివి". అన్నాడు సుందర్రావు నిట్టూర్చి.

"నీకు మాత్రం? ఒకర్తే కూతురు పెళ్ళి చెయ్యనే చేసేశావు. మరేవిటి నీకు సమస్య?" కొంత ముందుకు జరిగి అన్నాడు రామేశం.

"ఆడపిల్లల పెళ్ళిళ్ళే సమస్య లనుకునే రోజులు కావిని. మగపిల్లడి పెళ్ళి కూడా సమస్యేనోయ్". అన్నాడు సుందర్రావు కళ్ళద్దాలు తుడుచుకుంటూ.

"ఆ మాట నిజమే ! అయినా అబ్బాయి లందరి పెళ్ళిళ్ళూ అయ్యాయిగా?"

"ఇంకా ఎక్కడ? మూడో వాడింకా పెళ్ళికున్నాడు. వాడికి ఓ పట్టాన ఏ అమ్మాయి నచ్చటంలేదు. ఎక్కే గుమ్మం. దిగే గుమ్మం. సిగ్గేస్తోం దనుకో. ఆ మాటే వాడితో అంటే పెళ్ళెక్కడ వద్దంటాడో అని భయం". అన్నాడు సుందర్రావు నిట్టూరుస్తూ.

"ఇంతకీ మీ వాడి కోరిక లేవిటి? సినీస్టారు లాంటి పెళ్ళాం కావా లంటాడేవిటి?" అన్నాడు రామేశం సుందర్రావు భుజంమీద చెయ్యేసి.

"అదేంకాదు. వాడికి చదువుతో గాని, అందంతో గాని, ఉద్యోగంతో గాని, కట్నంతో గాని నిమిత్తం లేదు. అమ్మాయికి సంగీతం రావాలి. చక్కగా, తీయగా పాడగలగాలి, వాడి కలాంటి పిల్ల దొరకటంలేదు". అన్నాడు సుందర్రావు.

"మీవాడు అమాయకుడిలా ఉన్నాడు. అదెక్కడి కోరికయ్యా? నా మాట విని ఓ టూ ఇన్ వన్ కొనిచ్చి, ఈ పిచ్చి ముదరకముందే పెళ్ళి చేసెయ్యి. పెళ్ళాం ఏవైనా పాటలు పాడాలా? గాన కచేరీలు చేయాలా? టేపు రికార్డరులో కూడా మంచి సంగీతం వినవచ్చని చెప్పు". అన్నాడు రామేశం.

"ఆ మాటని వాడి నెలా బాధపెట్టమంటావు చెప్పు? వాడికి సంగీతం వచ్చు. వాడూ శ్రావ్యంగా పాడతాడు. మరి వాడి కోరికలో తప్పేముంది? భౌతిక సుఖ సౌఖ్యాలను పంచుకునేంతవరకే కాదుగా. మానసిక అనుభూతుల్నీ అన్యోన్యంగా పంచుకోగలిగినవారై ఉండాలి భార్య అయినా, భర్త అయినా". అన్నాడు కొడుకుతో ఏకీభవిస్తూ సుందర్రావు.

"నిజమే". అన్నాడు రామేశం ఎదురు చెప్పలేక

"విన్నావు కదా! మావాడి కెలాంటి అమ్మాయి కావాలో. నీ సర్కిల్ కాస్త పెద్దది. చాలామంది నీకు తెలుసు. ఏదైనా మంచి సంబంధం ఉంటే చెప్పు. నిలుచున్న పాటునే చెప్పు అని అనను. కాస్త నిదానంగానైనా చెప్పు, ఇదిగో నా ఎడ్రెస్". అంటూ ఎడ్రెస్ ఉన్న కార్డు అతని చేతి కిచ్చాడు సుందర్రావు.

"అలాగే. తప్పనిసరిగా చెప్తాను. నీకో మంచి కోడల్ని చూపెట్టిన క్రెడిట్ నాకు దక్కుతుందంటే కాదంటానా?" అంటూ కార్డందుకున్నాడు రామేశం.

"మరి వస్తాను. సిటీ బస్సుల సంగతి నీకు తెలును కదా!" అంటూ పరుగెత్తాడు సుందర్రావు.

## 2

మూడో రోజున అదే హెటలు వేపు నడుస్తున్న రామేశం, ఎదురుగా వస్తున్న రామ్మూర్తిని చూసి ఆగి - "ఏవిటి హడావుడి?" అన్నాడు.

"ఎవరూ, రామేశంగారా? నమస్కారం. బాగున్నారా?" అన్నాడు రామ్మూర్తి హాండ్ బాగ్‌ను భుజం మార్చుకుంటూ.

"అదే బాగు. ఇంతకీ అనకాపల్లి నుంచి ఎప్పుడొచ్చారు?"

"ఎప్పుడు రావడమేమిటి? వస్తూనే ఉన్నాను, వెళ్తూనే ఉన్నాను. వైజాగ్, కటక్, రాజమండ్రి, ఏలూరు, బెజవాడ... అన్నీ నావేనయ్యా?" అన్నాడు రామ్మూర్తి.

"అంటే నా కర్థం కాలేదు. రిటైర్ అయిన తరువాత ఏదైనా కంపెనీకి సేల్సు రిప్రజంటేటివ్‌గా పని చేస్తున్నారా? ఏమిటి కథ?"

"సేల్సు రిప్రజంటేటివ్‌గా కాదు. సేలయ్యేముడి వదార్థంకోనం తిరుగుతున్నాను". అన్నాడు రామ్మూర్తి.

"అర్థం అయి చావటంలేదు మహానుభావా?"

"అర్థం కాదు మహానుభావా ! మగపిల్లలున్న మీలాంటి వాళ్ళకి, ఆడపిల్లలున్న మాలాంటి వారి మాటలు, చేతలూ అర్థం కావు. కొనుక్కోడానికి అల్లు డెక్కడ

దొరుకుతాడా అని తిరుగుతున్నాను. అర్థమైంది కదా?"

"ఏవిటీ? ఇంకా నీకు కన్నెల చెర విడలేదూ? ఇంకా ఎంతమంది కన్యామణు లున్నా రేవిటి వివాహానికి?" దగ్గరగా జరిగి అడిగాడు రామేశం.

"ఇదే చివరిది? ఇద్ద రాడపిల్లలకి, ఇద్దరు మగపిల్లలకి పెళ్ళిళ్ళయిన సంగతి నీకు తెలుసు కదా!" అన్నాడు రామ్మూర్తి.

"అయితే అమ్మాయి పెళ్ళి బాకీ అన్నమాట సరే. ఇంతకీ అమ్మాయి ఏదైనా చదువుకుందా?"

"బి.ఏ. పాసయింది. వంటా వార్పు, కుట్లూ, అల్లికలూ అన్నీ వచ్చు. మా పెద్దమ్మాయిని చూశావుగా. దానిలా ఉంటుంది. రూపసి". అన్నాడు రామ్మూర్తి.

"మరయితే ఎక్కడ బ్రేక్?"

"డౌరీ బ్రేక్. అది గట్టి బ్రేకు కదా ! ఇరవై ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. పెళ్ళి మర్యాదగా జరిపిస్తాను". అన్నాడు రామ్మూర్తి మనసులో మాట చెప్పేస్తూ.

"బాగానే ఉంది. మనలో మాట. అమ్మాయికి సంగీతం గట్రా ఏమైనా వచ్చునా?" భుజంమీద చేయి వేసి అడిగాడు రామేశం.

"సంగీతం వస్తే మాత్రం ఏం ప్రయోజనం చెప్పు" .

"అంటే అమ్మాయి గొంతు శ్రావ్యంగా ఉండదా ఏం?"

"చాలా పెద్ద సందేహమే. దాని గొంతుకున్న శ్రావ్యత మా ఇంటిలో ఎవరికీ లేదు. చక్కగా తీయగా, హాయిగా వినసొంపుగా ఉంటుది గొంతు; వయెలిన్ వాయిస్తుంది. లలిత సంగీతం పోటీల్లో గాని, కర్ణాటక సంగీతం పోటీల్లో గాని ఎప్పుడూ దానికే ఫస్టు ప్రైజు. ఇంట్లో వాళ్ళమ్మకి సాయం చేస్తూ, ప్రైవేటుగా ఎమ్. ఏ. చదువుతూ, ఇంటి దగ్గర నలుగురి పిల్లలకి సంగీతం పాఠాలు చెప్తోంది. అయితే ఇవన్నీ ఎవరి క్కావాలి చెప్పు ఈ రోజుల్లో?" అన్నాడు రామ్మూర్తి ఆవేదన నిండిన గొంతుతో.

"నీ వలా అనకు. నీవు చాలా అదృష్టవంతుడివి. ఇలాంటి అమ్మాయే కావాలని పట్టుదలగా ఉన్నాడో అబ్బాయి". అన్నాడు చేతికర్రను నేలకు తాటిస్తూ.

"పెళ్ళి కొడుకే?"

"మహారాజులా !"

"మరి.... మరి... ఎవరో ఏవిటో చెప్పి కాస్త పుణ్యం కట్టుకొందూ బాబ్బాబు. చచ్చి నీ కడుపున వుడతాను". అన్నాడు రామ్మూర్తి రెండు చేతులు పట్టుకుని.

"నా కడుపున పుట్టడం ఎందుకూ? ఆడపిల్లల్ని కనడానికా?"

"నేను కంటానటోయి. నీ మాటలు గాని. కనేది స్త్రీ".

"కావచ్చు, కానీ ఆ మగ, ఆడ తేడాలకి మగవాడే కారకుడని చెప్తోంది సైన్సు."

"ఆ సైన్సు నా కెందుకు చెప్పు? అరవైలో పడబోయేవాడిని. ఆ వరు డెవరో చెప్పి పుణ్యం కట్టుకో."

"అలా అన్నావు బాగుంది. అబ్బాయి తండ్రిదీ ఈ ఊరే. అబ్బాయి బి.ఇడి. పాసై మాస్టరుగా ఈ చుట్టుపక్కలే ఎక్కడో చేస్తున్నాడు. నాకు రూఢిగా తెలుసు. అతగాడికి సంగీతం వచ్చిన, చక్కగా పాడగలిగే భార్య కావాలి."అంటూ వివరాలు చెప్పాడు రామేశం.

"నిజమా ! జోక్ చేస్తున్నావా?"

"నిజమే మహానుభావా ! ముమ్మాటికీ నిజం."

"అయితే అడ్రస్ ఇద్దూ."

"ఇంకా ఇవ్వడ మెందుకు? చూడు. ఇవ్వాళ అష్టమి. ఎల్లుండి దశమి. బుధవారం ఉదయమే మా ఇంటికి వచ్చేయి. మా ఇల్లు తెలుసుగా. మనం పెళ్ళి వారింటి కెళదాం. సుందర్రావు నా స్నేహితుడు. నే చెప్పినట్టు వింటాడు. ఈ సంబంధం ఖాయం. సరేనా?" అన్నాడు భుజం తడుతూ.

"అలాగే చేద్దాం. తప్పక వచ్చేస్తాను. ఏదో ఈ పుణ్యం కట్టుకోనాయనా!" అంటూ రామేశాన్ని హోటల్లోకి లాక్కెళ్ళాడు.

రామ్మూర్తి వద్దంటున్నా రామేశమే బిల్లు ఇచ్చాడు. బుధవారం ఉదయమే వస్తా'నంటూ సెలవు తీసుకున్నాడు రామ్మూర్తి.

"నీకు సుందర్రావు కొడుకు మూడోవాడు; రామకృష్ణ తెలుసా?" పిలిచి అడిగాడు రామేశం తన రెండో కొడుకు శేఖర్ని మర్నాటి ఉదయమే.

" తెలుసు. వాడు నాకు బి.ఏ.లో జూనియర్ !" అన్నాడు శేఖర్.

"వాడుపక్క ఊళ్ళోనో ఎక్కడో బి.ఇడి. మాస్టరుగా పని చేస్తున్నాడు కదూ?"

"నిజమే కాని, అది మూడు సంవత్సరాల క్రితం. ఇప్పుడు వాడు ఎమ్.ఏ. పాసయి ఈ ఊళ్ళోనే లెక్చరర్‌గా ఉంటున్నాడు."

తుళ్ళిపడ్డాడు రామేశం.

"ఎవరి గురించి నీ వంటున్నది?".

"రామకృష్ణ గురించే నాన్నగారూ ! రామకృష్ణ ప్రైవేటుగా ఎమ్.ఏ. పాసయి హిస్టరీ లెక్చరర్‌గా ఉంటున్నాడు."

"వాడు లెక్చరర్ ఏవిటి? నే న్నమ్మను. నీ వెక్కడో పొరబడ్డావు."

"మీరు నమ్మకపోయినా వాడి ఉద్యోగాని కేం డోకా లేదు. చాలా పుష్ ఉన్న మనిషి. ఇంకా పైకెళ్ళాలనే ప్రయత్నిస్తున్నాడు. ఇంకా పైకి వెళ్తాడు కూడా. ఇంతకీ ఎందు కడుగుతున్నారిదంతా?" వివరిస్తూ అడిగాడు శేఖర్.

"అబ్బే ఏం లేదు. ఏదో వాడు గుర్తుకొస్తే అడిగాను. నీకు బాంకు టైం

అవుతున్నట్టుంది. వెళ్ళు". అంటూ ఆ ప్రసంగానికి చుక్క పెట్టేశాడు రామేశం.

ఆ మర్నాడే సుందర్రావు దగ్గరి కెళ్ళాల్సిన రోజు, రామ్మూర్తి వచ్చే రోజున్నీ ఆ రాత్రి రామేశానికి నిద్ర పట్టలేదు.

బుధవారం ఉదయం తొమ్మిది గంటలకల్లా వచ్చేశాడు రామ్మూర్తి. రామేశం ఇల్లు వెతుక్కుంటూ, అతని కోసమే ఎదురుచూస్తున్నాడు రామేశం కాఫీ ఇచ్చి మర్యాద చేశాడు.

"ఇక వెళ్దామా". అన్నాడు రామ్మూర్తి.

"వెళ్దాము కానీ, ఈమధ్యనే నే నో మాట విన్నాను." అన్నాడు రామేశం తల వంచుకుని.

"ఏమిటది?" అన్నాడు రామ్మూర్తి కొద్దిగా ఆదుర్దాగా.

"సుందర్రావుకి అంటే పెళ్ళికొడుకు తండ్రికి కట్నం ఆశ మహా ఎక్కువ. ఆ కారణం చేతనే ఎన్ని మంచి సంబంధాలు వచ్చినా కట్నం చాలక అన్నింటినీ కాదనేశాడు. పెళ్ళికొడుక్కి ఇరవై అయిదు దాటాయి, పైగా ఉద్యోగస్థుడు కూడా. అయినా తండ్రి మాటకి చాలాకాలం విలువిచ్చాడు. అదీ ఎంత కాలమనీ, తండ్రి తన పెళ్ళి చెయ్యడని నిర్ధారించుకుని - నేను విన్న మాటే సుమండీ - నిజానిజాలు నాకు తెలియవు. అబ్బాయి రహస్యంగా వేరే కులం అమ్మాయిని పెళ్ళి చేసుకుని వేరే కాపురం పెట్టేశాడుట. పెళ్ళి చేసుకోలేదు గాని ఉంచుకున్నాడు అంటారు కొందరు. ఏది ఏమైనా రహస్యం ఎంత కాలం దాగుతుందని? నిజం తెలిసి లబోదిబోమన్నాడు సుందర్రావు. ఎలాగైనా కొడుక్కి పెళ్ళి చేసి, ఆ పిల్లనుంచి తప్పించాలని మహా యాతన పడుతున్నాడు. పైకి మాత్రం మా వాడికి సంగీతం వచ్చిన అమ్మాయి కావాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఇది తెలిసి ఎవరూ పిల్లనివ్వడానికి ముందుకి రావటంలేదు. అదీ సంగతి. నిన్ను ఇవాళ రమ్మన్నాను. నిజమే కాని చూస్తూ చూస్తూ ఇలాంటి సంబంధం ఎలా చేస్తాము చెప్పు? నీ కూతురికేం తక్కువ? కులం తక్కువా? గుణం తక్కువా? చదువు లేదా? అందం లేదా? చూడూ ఆలస్యం అయితే అయింది. మంచి సంబంధమే చూసి చేద్దాం. ఏమంటావు?" అన్నాడు రామేశం.

"అయితే ఇంత కథ ఉందా? నాకు తెలియదు. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేకపోతున్నాము" అన్నాడు రామ్మూర్తి.

"ఏం చేస్తాం? మనుషుల ముఖాల మీద గుణగణాలు రాసి ఉండవు కదా! ఏ బాధపడ్డా ఓ మంచి అయ్య చేతిలో పిల్లని పెట్టాలనే కదా మన తాపత్రయం. ఏదైనా దేనికైనా టైము రావాలి. ఇంత తెలిసినతరువాత అక్కడికి ఎలా వెళ్ళగలము?"

"అవును మరి వెళ్ళే ప్రశ్నే లేదు. తిన్నగా అనకాపల్లి బస్సు ఎక్కేస్తాను."

"అలాగే చెయ్యి ఏదైనా మంచి సంబంధం ఉంటే నేనే రాస్తాను. వద్దువు గాని. మరో మాట. సుంద్రరావు కొడుకు గురించి నే చెప్పిన దేదీ ఎవరితోనూ

అనకుసుమా, నే నేదో ప్రచారం చేస్తున్నామని ఏడ్చిపోతాడు. నీలాగే అతనూ స్నేహితుడే నాకు.''

"నేను మాత్రం ఎందుకంటాను? మనకు సంబంధం నచ్చలేదు. అంతే మరి వస్తాను.'' అంటూ సెలవు తీసుకుని బయలుదేరాడు రామ్మూర్తి.

"మంచిది.'' అంటూ గేటు వరకు సాగనంపాడు రామేశం.

ఎంతో ఆశతో వస్తే ఇలా అయిందే - అని అనుకుంటూ ఎంతో నిరాశతో కదిలాడు రామ్మూర్తి. సంగీతం నేర్చిన తన కూతురికి సంగీతంలో ప్రవేశమున్న భర్త లభిస్తాడని ఎంతో పొంగిపోయాడు. ఏమైనా పెద్ద లన్నట్టు మంచి కూటికి మంచి కూర దొరకదంటారు. అదే కాబోలు ఇది. అని తలపోస్తూ ముందుకు కదులుతూ వీధి మలుపు తిరిగాడు. కొద్ది దూరం నాలుగడుగులు వేసేడో లేదో- "నమస్కారం, మామయ్యగారూ!'' అన్నమాటలు వినిపించాయి. తల ఎత్తి చూశాడు.

"నన్ను గుర్తు పట్టలేదాండీ నేనూ, శేఖర్‌ని.'' అన్నాడు శేఖర్ సైకిలు దిగుతూ.

"శేఖర్ ! అంటే రామేశం రెండో అబ్బాయివి కదూ ! అడిగాడు.

"అవునండీ ! నేనే. ఎప్పు డొచ్చారండీ? అక్కడే ఉంటున్నారా? విశాల బాగుందా? పెళ్ళి అయిందట కదా? ఎక్కడుంటోంది?'' క్రమక్రమంగా అతని గొంతు వణుకుతూ ఆగిపోయింది.

"కులాసాగానే ఉంటోంది బాబూ. బొంబాయిలో ఉంటోంది. ఇద్దరు పిల్లలు. నీవు కులాసాయే కదా బాబూ !''

"కులాసాయేనండి. నన్నెప్పుడైనా తలుస్తారా మామయ్యా?''

"ఎందుకు తలవం బాబూ? విశాల వచ్చినప్పుడల్లా నిన్నే అడుగుతుంది. విధి అనుకూలించలేదు గాని మా ఇంటి అల్లుడివి కావలసినవాడివి.''

"విధి కాదు మామయ్యా ! నిధి మా నాన్నకు డబ్బుకావాలి. అతని మాట నెగ్గాలి. ఎవరి ఆశలు ఏమైనా అతని కక్కరలేదు. పోనీండి మావయ్యా. గతజలసేతు బంధనం. ఇప్పుడను కొని ప్రయోజనం లేదు. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. రండి'' అన్నాడు శేఖర్.

"మీ ఇంటికే వెళ్ళి వస్తున్నాను మీ నాన్న దగ్గరికి. ఏదో మంచి సంబంధం మా వసంతకి ఉందంటేనూ.''

"మరి వెళ్ళి చూశారా?''

"లేదు బాబూ ! ఆ సంబంధం అంత మంచిదిగా కనబడటంలేదు.''

"ఏ సంబంధం మావయ్యా?''

"సుందర్రావుగారి అబ్బాయి రామకృష్ణ.''

"ఆ సంబంధం మంచిది కాదా? ఆ మాట మీతో ఎవరన్నారు?''

"ఇంకెవరు బాబూ ! మీ నాన్నే''

"మా నాన్న చెప్పారా? నిన్ననే రామకృష్ణ గురించి సన్నడిగారు. రామకృష్ణ, గురించి ఎప్పుడూ నాన్న చెడ్డగా అనలేదే. ఈ సంబంధం మంచిది కాదని ఎందు కన్నారు? అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పండి" అడిగాడు శేఖర్.

రామేశం చెప్పినదంతా వివరంగా చెప్పాడు రామ్మూర్తి. విని శేఖర్ నవ్వాడు. "మావయ్యా ఈ రోజు నాకు సెలవు. నాతో రండి." అంటూ సైకిలు వెనక్కి తిప్పి- "రండి మావయ్యా !" అంటూ హెచ్చరించాడు శేఖర్.

+ + +

ఉదయం తొమ్మిదిన్నర దాటినవేళ.

శేఖర్ బాంకుకు వెళ్ళడానికి ఆయత్తమవుతూంటే, రామేశం దినపత్రికను మరోసారి పునశ్చరణ చేస్తూంటే పోస్టుమాన్ ఒక కవరు శేఖర్ చేతి కిచ్చి వెళ్ళిపోయాడు.

"ఏవిటి? వెడ్డింగ్ కార్డులా ఉంది." అన్నాడు రామేశం.

"వెడ్డింగ్ కార్డే నాన్నగారూ ! మీ పేరిట వచ్చింది" అని కవరు విప్పి - "రామకృష్ణకు పెళ్ళి నాన్నగారూ !" అన్నాడు శేఖర్.

"రామకృష్ణకా? ఎవర్రా అమ్మాయి?"

"వసంత నాన్నా ! రామ్మూర్తి మావయ్య కూతురు."

"రామకృష్ణకూ, వసంతకూ పెళ్ళా?" ఆశ్చర్యపోతూ అడిగాడు రామేశం.

"ఏంటలా ఆశ్చర్యపోతున్నారు? రామకృష్ణకి వసంత తగదా? వసంతకి రామకృష్ణ తగడా?"

"అది కాదు. అది కాదు..."

"ఏది కాదు నాన్నగారూ! నిజంగా ఈ పెళ్ళి మీ చేతులమీదుగా జరగాల్సింది. మీ కా క్రెడిట్ దక్కటంలేదు ఎందువల్లో!"

"ఏవిటి శేఖర్ నీ వనేది?"

"ఎందుకు నాన్నగారూ దాగుడుమూత లాడతారు? వసంతకి రామకృష్ణ సరియైన జోడీ అని రామకృష్ణ గురించి రామ్మూర్తి మావయ్యకి చెప్పి ప్రోత్సహించింది మీరు. అప్పటికి నిజంగా మావయ్యకి ఉపకారం చేద్దామనే మీ ఉద్దేశం. కాని ఎప్పుడయితే రామకృష్ణ మామూలు బడిపంతులు కాడని, ఓ పెద్ద జీతగాడని, గెజిటెడ్ ఆఫీసరని మీకు తెలిసిందో అప్పుడే 'రామ్మూర్తికి అంత పెద్దస్థాయిలో ఉన్న అల్లుడు దొరకటమా?' ఆ సంబంధం వసంతకి కుదరకూడదని చూశారు. దాని పర్యవసానమే ఏ పాపం తెలియని రామకృష్ణకి చాలా అసహ్యకరమైన చరిత్ర అంటగట్టారు. ఇదేమన్నా న్యాయమా చెప్పండి.? మీరు మావయ్యతో రామకృష్ణ గురించి అన్న మాటల్లో ఒక్క మాటైనా నిజముందా చెప్పండి మీ గుండెమీద చెయ్యేసుకుని. మీరు చెప్పలేరు. కారణం మీరు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు ! మీలాంటి వాళ్ళకి ఎప్పుడో ఒకసారి ఇతరులకి ఉపకారం చేయాలనే బుద్ధి పుడుతుంది. కాని అవతలి

వాళ్ళు మీ రూహించిన దానికన్నా కాస్త ఎక్కువగా లబ్ధి పొదుతున్నట్టు కనిపిస్తే మీరు సహించలేరు. ఉపకారానికి ప్రతిగా అపకారమే చేస్తారు. ఇంతకీ రామకృష్ణ మీకేం అపకారం చేశాడు? ఎందు కతనిమీద బురద జల్లారు?"

"నే చెప్తా వినండి. మీ ఎదుటనే మీ రూహించని ఎత్తుకి రామకృష్ణ ఎదిగినందుకు మీలో కలిగిన ఓర్వలేనితనమే కాదా ఇందుకు కారణం? లక్కీగా మావయ్య నా కంట పడ్డాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే రామకృష్ణ కెరియర్ పాడయ్యేది కాదా? నాన్నగారూ ! మీలాంటి వాళ్ళందరికీ నాది ఒకేఒక సలహా. దయచేసి మీ రెవరికీ ఉపకారం చెయ్యాలని తలపెట్టకండి. పాపం ! మీరు ఉపకారం చేయాలనే అపకారం చేస్తుంటారు. మీలాంటి వాళ్ళను గుర్తించడం కూడా అంత సులభం కాదు. మీ రంతకు ముందు ఒక పొరపాటు చెయ్యనే చేశారు. దాన్ని చక్కదిద్దే అవకాశం ఎవరికీ లేదు. ఆ అవకాశం నాకు దొరికింది. చక్కదిద్దాను. ఇకనైనా మీరు చేసే తప్పును మీరు గ్రహిస్తే చాలు. అంతకన్నా నాకు కావలసిన దేదీ లేదు" అంటూ అగాడు శేఖర్.

"శేఖర్ ! అయామ్ సారీ ! నిజానికి రామకృష్ణ కెరియర్ చెడగొట్టాలని గాని, వసంతకి మొగుడు దొరకకూడదని కాని నా ఉద్దేశాలు కావురా... కాని..."

"కాని... కాని వాళ్ళిద్దరూ భార్యా భర్తలు కాకూడదు. అంతేకదండి? ఏదైనా ఒకటేనండి. పరిణామాలు భయంకరమైనవే. ఇంతవరకూ మీరు చేసిన ఉపకారాలు చాలు. మీ రెవ్వరికీ ఉపకారాలు చెయ్యకండి. మీ కేమాత్రం ధైర్యమున్నా పెళ్ళికి వెళ్ళి ఇద్దరినీ దీవించిరండి. మీనుంచి అంతకన్నా ఎవరూ ఏమీ ఆశించరు. అదే పదివేలు. మరి వస్తాను. ఆఫీసుకు టైమవుతోంది" అంటూ కదులుతున్న శేఖర్ని చూస్తూ ఉండిపోయాడు రామేశం.

తనకు తెలియని తన అంతరంగం శేఖర్కి ఎలా తెలిసిందా అని విస్తుపోవడం తప్ప మరేంచేయలేకపోయాడతను.

★ ★ ★